


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### 'మే ఆవత్ హూ!'

**గేటెడ్ కమ్యూనిటీ** అంటే చాలా సరదా పడ్డాను. కానీ కరోనా పుణ్యమా అని అన్నీ కట్టుకుని ఇంట్లో కూర్చోవలసి వస్తోంది. కింద సూపర్ మార్కెట్ వున్నా, బిగ్ బాస్కెట్ వాడు ఇచ్చే నల్లని ఎలుక పిల్లల్లాంటి అరిటి పండ్లూ, ఎండిపోయిన కరివేపాకూ, వాడి ధర్మం మన భాగ్యంగా ఏవిస్తే అది తీసుకోవాల్సి వస్తోంది.

స్విమ్మింగ్ పూల్, బాడ్మింటెన్ కోర్ట్, జిమ్‌లాంటివన్నీ పేరుకి మాత్రమే కనపడ్తున్నాయి కానీ కనీసం వాకింగ్ చెయ్యడానికి కిందకి లిఫ్టులో వెళ్ళడానికి భయం. ముక్కుకి గుడ్డలతో ఆగంతకులు చిన్నప్పుడు బందిపోటు దొంగలని చందమామలో చూసేవాళ్ళం. ఇప్పుడు లిఫ్ట్‌లోనో, వరండాలోనో ఎదురుపడితే భయంగా పక్కకి తప్పుకోవలసి వస్తోంది. చుట్టాల ముఖాలు మర్చిపోకుండా జూమ్ మీటింగ్‌లు కానిస్తున్నాం. మా అమ్మలాంటి వాళ్ళకి ఎవరెవరో వెతుక్కుని, గుర్తుపట్టేసరికే ఆ గంటా అయిపోతోంది. ఇంక గేటెడ్ కమ్యూనిటీ సౌకర్యం ఎక్కడ కనిపించిందయ్యా అంటే 'మెయిడ్స్‌నీ, డ్రైవర్స్‌నీ ఎలా చెయ్యం' అనడంలో.

ఇంటికి కొత్త వ్యక్తి వస్తే కోవిడ్ టెస్ట్ చేయించారా? లేకపోతే పెట్టే బేడా అటునుండి అటే "గెట్ హిమ్ ఔట్" అనడంతో గేట్ దగ్గర టెంపరేచర్, ఆక్సిజెన్ లెవెల్స్ చెక్ చేసి, చేతుల్లో శానిటైజర్ వేసి లోపలికి పంపడం. అసలు బయటకి వెళ్తే రిజిస్టర్ 'చెక్ అవుట్' అయి కారణం చెప్పాల్సిన పరిస్థితి. ఎంతటి దౌర్భాగ్యం రా తండ్రీ? శత్రు దేశాలకి కూడా ఇట్లాంటి పరిస్థితులు రాకూడదు. వాడెవడో గబ్బిలాలు తినీ, ఎలకలు తినీ మనకి ఈ బహుమతి పంపించాడనీ.. కాదు లాబ్‌లో ఈ 'వైరస్'ని వండి మరీ పంపించాడనీ విని నా బోటిది పులిహోర పోపు వేయిస్తూ "ప్రపంచంలో ఇన్ని రుచి అయిన తినుబండారాలుండగా, గబ్బిలాలూ, మండ్రగబ్బలూ తినడం ఏవిట్రా భగవంతుడా? ఆ పాపం ప్రపంచాన్ని వణికించడం ఏవిటని రోజూ ఏడుస్తోంది.

సరే.. రూల్స్ కొద్దిగా సడలించి, ప్రస్తుతం ఇంటికి ఒకే మెయిడ్‌ని అనుమతిస్తున్నారు. మన ఇష్టం. అంట్లకి ఒకళ్ళు, బట్టలికి ఒకళ్ళు, వంటకి ఒకళ్ళు, పిల్లాడ్ని చూడ్డానికి ఒకళ్ళు.. అని సోకులు పోవడానికి లేదు. కింద 'కమ్యూనిటీ గైడ్ లైన్స్' ఒప్పుకోవు. ఇంటికి ఒక్కరే. అంటే రష్యాలోలా సోషలిజం. గొప్ప అయితే నాకేంటి? నేనిచ్చిందే తినాలి అని లైన్లల్లో నిలబెట్టి క్యాబేజీ, దుంపలిచ్చేవాళ్ళు రష్యాలో అని ఐయన్ రాండ్ 'We the Living'లో చదివాం. సరిగ్గా అలాగే ఇప్పుడు సోషలిజం రుద్దబడింది.అసలు మూడు నెలలు ఏ VICCలూ చెయ్యలేని పని, ఈ ఇంటి పనులు చేసేసి మనుషుల్ని బరువు తగ్గించాయి. కానీ నడుములు పట్టేసి, మనుషులు తలకి రంగేసినా, షోగ్గా చీర కట్టినా ఏవుందిలే, మాస్క్‌వల్ల ఎటూ పోల్చుకోలేరని, ఒకలాంటి వైరాగ్యంలో, తలమాసి లిటరెల్‌గా మగాళ్ళు మెడలదాకా జుట్లుపెంచి,

గెడ్డాలు చేసుకోకుండా, ఆడవారు కొందరు బ్యూటీషియన్‌లు లేక గెడ్డాలూ, మీసాలూ మొలిచి, ఒరిజినల్ రంగులు బయటపడి దిక్కులేక (మరీ దిక్కుమాలిన అనలేక) ఈసురోమని కనిపిస్తున్నారు.

సరే ఇంటికి ఒక్క మెయిడ్ అన్న కాన్సెప్ట్‌లో పనిమనిషిని పిలుచుకోవాలా? లేక ఆయానా? అని మా అబ్బాయి, కోడలూ కొన్నాళ్ళు ఆఫీస్ పని పక్కకి నెట్టి, బోలెడు ఆలోచించి, ఇద్దరూ నా దగ్గరకొచ్చి "'ఆయా' వస్తే నీకు సౌకర్యంగా వుంటుందమ్మా వీడిని నువ్వు పట్టుకోలేవు" అని తేల్చారు. నేను సరేనన్నాను.

ఆయా ఫలానా 'దేవి' గేట్‌లోకి 'చెక్ ఇన్' అయిందీ 'చెక్ అవుట్' అవుతోందీ ఇలాంటివన్నీ మన ఫోన్‌కి మెసేజ్‌లు వస్తాయి. మా ఆయా భోజ్‌పురీ ఆవిడ. మనం సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా వున్నప్పుడు బోలెడు భోజ్‌పురీ సినిమాలు చూసేసిన అనుభవం వలన 'తూ ఆవత్ హై', 'మై జావత్ హై' లాంటి భాష ఆమెతో అనర్గళంగా మాట్లాడగలనూ, అర్థం చేసుకోగలనూ. పాపం ఒళ్ళు దాచుకోదు. బాబు పడుకున్నాక ఇల్లంతా వూడ్చి, మాపింగ్ చేస్తుంది. అది నిజంగా సినిమా హాల్ అంత ముందు వరండాతో ఓ పెళ్ళి హాయిగా చేయచ్చు అన్నంత పెద్ద హాల్‌తో, లంకంత ఫ్లాట్.

నేను కాస్త సుఖంగా వున్నాను అనుకుంటుండగా ఓ ట్విస్ట్.. చూడండీ సినిమా కథల్లో కూడా అంతే అందరూ కలిసి హాలిడేకెళ్ళి ఓ బంగళాలో పాటలవీ పాడుకుని "అనురాగ గోపురం.. ఆవకాయ కాపురం" అని పాడేసుకున్నాక, ఆ బంగళాలో మిస్టీరిస్‌గా ఎవరో మాయం అవడంతో డిటెక్టివ్ సినిమాల్లో ట్విస్ట్‌లు మొదలవుతాయి. అదే సాంఘిక సినిమాలు అయితే, ఆ ఇంట్లోకి ఒక కొత్తకోడలో, అల్లుడో వచ్చి, అందరూ ఒకరికి ఒకరు జడలేసుకుంటూ, నోళ్ళల్లో అన్నం కలిపి ముద్దలు పెట్టుకుంటూ వున్న సమయంలో కలతలు పెట్టి హాల్లో నిలువుగా ముగ్గుపోసి, ఆ ముగ్గు మీద అసహ్యంగా గోడకట్టి, గోడ ప్లాస్టరింగ్ చెయ్యకుండా వదిలేసి, ఆ గోడలమీదనుండే పోట్లాటలూ, కన్నీళ్ళ ఎమోషన్లూ. దసరాబుల్లోడు సినిమాలోలా. అదే జానపదం అయితే సడెన్‌గా ఒక మాంత్రికుడు రాజకుమార్తెని చూసి, ఆమె జలకాలాటని 'త్రీడీ' ఎఫెక్ట్‌లో కని, మరులుకొని, సన్యాసం మానుకుని, చిలుకని పట్టి అందులో తన ప్రాణాలు పెట్టి, మర్రిచెట్టు తొర్రలో పెట్టి, అప్పుడు కోటలో అడుగెట్టి, రాకుమారిని అపహరించడంతో ట్విస్ట్. రాకుమారిని తెచ్చిన వీరుడికి అర్ధరాజ్యం, దానితోబాటు అమ్మాయినీ ఇస్తాం అని. అప్పుడు వరకట్నాలు ఆమోతాదులో వుండేవి. ఇప్పుడు కట్నాలు స్టార్ హోటల్స్, ఎయిర్‌లైన్స్, రిలయన్స్ ఈ లెవెల్‌లో వుంటాయి వున్నవాళ్ళ కట్నాలు. లేనివాడు వాచీ, సైకిల్ తీసుకున్నా, వేధించాడని వరకట్నం నేరంపై జైల్లో 'తిరగలి తిప్పించచ్చు' అది వేరే సంగతి.

ఇంతకీ మాకొచ్చిన ట్విస్ట్ ఏవిటంటే, ఓనాడు ఆయా బాబుకి స్నానం చేయిస్తుండగా నాకు ఫోన్ వచ్చింది. గేట్ దగ్గర సెక్యూరిటీ నుండి "మీ ఇంట్లో పనిచేసే 'ఫలానా దేవిని అర్జెంటుగా సెక్యూరిటీ హెడ్డు పిలుస్తున్నాడని."

"వస్తుందిలే అసలే లేట్‌గా వచ్చింది, పిల్లాడికి నీళ్ళు పోస్తోందన్నా. కిచెన్‌లో వంకాయల్లో వుల్లికారం కూరుతూ. నా వంకాయలు మగ్గేలోగా మూడుసార్లు మళ్ళీ కాల్ వచ్చింది. నేనెళ్ళి ఆయాదగ్గరనుండి మా యువరాజుని అర్జెంటుగా తీసుకుని 'డయిపర్ నేనేస్తా'కానీ నువ్వెళ్ళి ఆ సెక్యూరిటీ హెడ్డుని కలిసిరా" అన్నాను.

వీళ్ళు వచ్చేటప్పుడూ, వెళ్ళేటప్పుడూ వీళ్ళ ఐడెంటిటీ కార్డులు చూపించి చెక్ ఇన్ చెయ్యాలి. తొందరలో ఈ పని చేసుండదు అనుకున్నాను.

కానీ కాసేపటికి మా ఆయా భోజ్ పురిలో శోకాలు పెడ్తూ, ద్రౌపది జుట్టు విరబోసుకుని, నిండు సభలో నన్ను అవమానించిన 'దుశ్శాసనుని' మక్కెలిరగదన్నకపోతే ఇంతింత ఒళ్ళు పెంచిన మొగుళ్ళెందుకూ? వీళ్ళ రికార్డులెందుకూ? అని పబ్లిక్‌గా ఛాలెంజ్ చేసి, వాళ్ళ తొడలూ, గూడలూ విరగ్గొట్టించి చంపినట్లు రెచ్చిపోతూ వచ్చింది ఈ ఆయా దేవి. మా అమ్మకి ఈవిడ భాష అర్థంకాదు.

అర్థంకాదని వూరుకోదు. అన్నీ చెప్పేదాకా అడిగి పూర్తిగా నూటికి నూరుపాళ్ళూ తప్పుగా అర్థం చేసుకుని గవర్నమెంట్ వారిలా నివేదిక తయ్యారు చేసి, నాకు వినిపిస్తుంది. డైరెక్ట్‌గా నన్ను దర్యాప్తు చెయ్యనివ్వదు. అచ్చు గవర్నమెంట్ పాలసీనే!

"ఆవల్ జావత్ కా టేమ్ మే చేకిన్ కర హైనా మాజీ...మాఝే కో సోర్ కెహలాతే హై ...కాయ్ కరత్ హై.. హమే!" ఈ టైప్‌లో అరుస్తూ ఏదో చెప్తోంది దేవి. మా బుడ్డోడు ఆ ఏక్షన్‌కి పకపకా నవ్వుతున్నాడు. మా అమ్మ ఇంటరాగేషన్ "ఆవకాయా, జావకాయాలాంటివి పట్టుకెళ్తేనే కేసు అంటారా? మీ ఆయన కూడా అనుమానించాడా? నా దగ్గరకి తీసుకురా.. నేను మాట్లాడతా! ఏవిటీ? పోలీస్ కేసా? మొన్నెప్పుడో కాస్త సీసాలో పెట్టి పాత ఆవకాయ ఇచ్చాను. దానికే కేసా? ఈ అపార్ట్‌మెంట్ కల్చర్ కాకెత్తుకుపోను. మరీ విడ్డూరంగా వుందే వుండు మా అమ్మాయికి చెప్తాం. తెలంగాణా గవర్నమెంటులో దానికి పెద్ద పెద్ద వాళ్ళు తెలుసు" అని కేసుని కొత్తదారి పట్టిస్తోంది మా అమ్మ.

మా కోడలు పాత సినిమాల్లో అంజలీదేవీ, శ్రీరంజనిలా చాలా నెమ్మదైన స్వరంతో "ఆంటీ" ఈ సంబోధన నన్ను కాదు 'ఆయా'ని అని గమనించగోర్తాను. "ఆంటీ.. ధీరేసే బోలియే.. క్యా హువా?" అని అడుగుతోంది.

"మొన్న ఎండిపోతోందని పాత ఆవకాయ ఇచ్చాను. అది పెట్టికెళ్ళిందని కేసు పెడ్తాం అన్నారట, మా అమ్మ ఆంధ్రానుండి హైదరాబాద్‌కి కొత్తగా బదిలీ అయి హిందీరాక అవస్తపడ్తూ, కేసు ఎంక్వైరీ చేస్తున్న కానిస్టేబుల్‌లా మాట్లాడ్తోంది.

ఆయాకి అసలు విషయం తక్కువా అభినయం ఎక్కువా. టీవీ సీరియల్స్‌లో ఆడవిలన్స్, గంటసేపు పాము బొట్టు పెట్టుకునీ, జుట్టు గుండ్రాలు తిప్పుకునీ 'తుప్పాసి' కుంత్రీ ప్లాన్ ఒకటి డిజైన్ చేసినట్లు.

"కవ్‌డా.. హమ్ దివత్ హై.. ఓ ఫేస్ బుక్ మే దాలత్ హై.. ముసల్మాన్ హై.. సూపరెండెంట్ కా గాడీ మే జావత్ హై రోజ్..." అని వీరాభినయంతో చెప్తూ "ఫేస్ బుక్ పే డాలా" అంటోంది.

మా అమ్మ పాయింట్ పట్టేసినట్లు నిన్ను "అస్తమానం ఫేస్‌బుక్‌లో ఇంటి సంగతులు అన్నీ రాసేస్తావు. 'మా అమ్మ పెన్షన్ అడిగిందీ.. ఆవకాయ పెట్టిందీ.. అన్నయ్య దగ్గరకి వెళ్తానంది' అనీ, పాపం దీని గురించి ఎందుకు ఫేస్ బుక్‌లో రాసావు? అమ్మా ఫేస్ బుక్ అంటోంది చూడు" అని తన వుక్రోషం తను బయట పెట్టింది.

నా వంకాయ కూర మాడు వాసన వచ్చాక ఈ గొడవ వల్ల నేను స్టౌ ఆఫ్ చేసి, సెక్యూరిటీ ఆఫీసర్‌కి ఫోన్ చేసి సంగతి కనుక్కున్నాను.

అసలు విషయం ఏవిటంటే మా ఆయా దేవి మొగుడు, ఆయన సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేసే ఇంట్లో వాళ్ళు అహమ్మదాబాద్ వెళ్ళిపోతున్నారు. ఇల్లు ఖాళీచేసారని వాళ్ళు కొన్ని పాతబట్టలిచ్చారని సూట్‌కేస్‌లో తెచ్చి ఇచ్చాడు. ఆ బట్టల్లో కొన్ని స్కూల్ యూనిఫామ్స్ కూడా వున్నాయి. ఆ బట్టలు తనకి ఆడపిల్లలు లేనందువల్ల ఆయా, ముసల్మాన్ సెక్యూరిటీగార్డ్ అమ్మాయి "మా పిల్లలకి ఏవైనా బట్టలు ఇవ్వు" అని అడిగితే ఇచ్చిందట. ఆ యూనిఫామ్ వేసుకుని, ఆవిడ పిల్లలు ఫేస్‌బుక్‌లో ఫోటోలు పెట్టారట. ఇక్కడిదాకా కథలో మామూలు మలుపులే. కానీ ఇక్కడే భయంకరమైన ట్విస్ట్. అదే యూనిఫామ్ కల స్కూల్ మా కమ్యూనిటీలో వుంది కదా. ఆ యూనిఫామ్స్ వున్న పార్సిల్ పోయిందట. ఎవరు తీసుకెళ్ళారో కానీ స్కూల్ మేనేజ్‌మెంట్‌కి అందలేదట. 80వేల రూపాయల బట్టల దొంగతనం నేరం మా 'ఆవత్, జావత్'ఆయా మీద మోపారు. ఎందుకంటే ఆ సెక్యూరిటీ గార్డ్ పిల్లలు ఈ బట్టల్లో తీయించుకున్న ఫోటోలు ఎఫ్.బీలో పెట్టారు. ఆ ఫోటోలు ప్రిన్సిపాల్ చూసింది.

మా ఆయా నెరేషన్‌లో సెక్యూరిటీ గార్డ్ మతాన్ని ఇన్‌వాల్వ్ చేసింది. ఆ తర్వాత ఛీఫ్‌తో గాడీలో వెళ్తుంది పక్కన కూర్చుని, అని 'జెండర్' కార్డ్ వాడి, ఏ సెక్యూరిటీ గార్డ్ పిల్లలకి తను బట్టలిచ్చిందో ఆ సెక్యూరిటీగార్డే తనవైపు కాకుండా సెక్యూరిటీవాళ్ళవైపు నిలబడి తనని నిందించటం మా ఆయాదేవికి నచ్చలేదు. ఆమె కేరెక్టర్‌ని అసాసినేట్ చేస్తూ నర్మగర్భంగా మాట్లాడింది.


ఇంక 'లా' అనేది ఇంతింత లావు పుస్తకాలు చదివి కేసు షీట్ రాయనక్కర్లేదు. ప్రజలలో వాళ్ళ మనుగడ కోసం వాళ్ళు నిర్మించుకునే వాదనలల్లోంచే 'లా' పుడ్తుంది. చట్టాలు తయ్యారవుతాయి అని ఆయా ఫ్రేమ్ చేసిన వాదనవల్ల తెలుస్తోంది.

మా అబ్బాయి ఆయా మొగుడ్ని పిలిపించాడు. ఆ బట్టలిచ్చిన యజమాని ఫోన్ నెంబర్ తీసుకుని అహమ్మదాబాద్‌కి కాల్ చేయించి మాట్లాడాడు. ఆయనిచ్చిన క్లారిఫికేషన్ ప్రకారం తన పిల్లలకోసం కొన్న కొత్త యూనిఫామ్స్ వెళ్ళిపోతున్నారు కాబట్టి ఎవరికైనా ఇవ్వమని ఇచ్చేసి వెళ్ళిపోయారు అని రిటన్‌గా తీసుకున్నాడు. కమ్యూనిటీలో బోర్డ్ వాళ్ళకి ఎవిడెన్స్ సబ్మిట్ చేసి 'ఆయా దేవి' నిర్దోషి అని కేస్ క్లోజ్ చేయించాడు.

కానీ ఆ 80వేల రూపాయల ఖరీదు చేసే యూనిఫామ్స్ బట్టలు ఏమయ్యాయో, ఎవరు కొట్టేసారో ఆ భగవంతుడికే తెలుసు. ఫరదర్‌గా ఇన్‌వెస్టిగేషన్ అయిందో లేదో కనుక్కోమని నేను మా కోడలికి చెప్పాను. ఒక నిర్దోషి మీద, బీదదని నేరం మోపడం తప్పుకదా. పైగా అన్ని బట్టలు గేట్‌లోంచి తీసుకెళ్తుంటే ఈ సెక్యూరిటీవాళ్ళు కళ్ళు మూసుకున్నారా? మా అమ్మ చెప్పినట్లు ఆవకాయ తీసుకెళ్తుంటేనే వంద ప్రశ్నలేసి, మాకు ఫోన్ చేస్తారే. 'మీరిచ్చారా? తను తీసుకెళ్తోందా?' అని.

ఈ మొత్తం కేస్‌లో సోషల్ మీడియా ప్రముఖ పాత్ర వహించింది. ఆ సెక్యూరిటీ గార్డ్ పిల్లలు ఆ యూనిఫామ్ వేసుకుని, ఎఫ్.బి పిక్స్ పోస్ట్ చెయ్యడం, అవి ఈ స్కూల్ ప్రిన్సిపాల్ చూసి రిపోర్ట్ చెయ్యడం హైలెట్. పెద్ద పెద్ద క్రైంలు చేసేవాళ్ళు కూడా ఈ మధ్య ఎఫ్.బి వల్ల పట్టుబడ్తున్నారు. ఓ మర్డర్ చేసి డబ్బు కొట్టేసి పారిపోయేవాడుకూడా "చెక్‌డ్ ఇన్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ విత్ చోటా దాస్ అండ్ రామ్ లాల్" అని సహచరుల పేర్లతో సహా ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసి మరీ పారిపోవడం అనే బలహీనత వలన పట్టుబడ్తున్నాడు. ఫేస్ బుక్ మేనియా.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4